# ఆ కిటికి

"భీమారావు గారంటే మీరేగా? రిసెప్షన్‌లో చెప్పారు. నేను వనజ సిస్టర్ని. తిరుపతి నుండి వచ్చాను. మా అక్క చావు గురించి మీకేమైనా తెలుసేమోనని...."

హడావుడిగా ప్రశ్నలు గుప్పిస్తున్న అమ్మాయికేసి చూశా. వనజ పోలికలున్నాయి. తన కంటె ఒకటి, రెండేళ్లు చిన్నదేమో!

"నాకేం తెలుస్తుంది? అసలు వనజతో పరిచయమే అంతంత మాత్రం. ఈ క్లబ్‌కి నేను రెగ్యులర్ కస్టమర్ని. వారానికోసారి తాగడానికి వస్తూంటాను. వనజ ఇక్కడ పాటలు పాడుతూంటుంది. ఒకసారి తెలుగుపాట హమ్ చేస్తే అడిగేను. తెలుగమ్మాయినని చెప్పింది. పరాయిరాష్ట్రంలో మనవాళ్లను చూసినప్పుడు కలిగే అభిమానమే కలిగింది. అప్పుడప్పుడు పలకరించేవాణ్ని. మూడురోజుల క్రితం పోయిందంటే అయ్యో పాపం అనుకున్నాను..."

"... మామూలుగా పోవడం కాదు అంకుల్. పదిహేనో అంతస్తు కిటికీలోంచి తోసేస్తే కిందపడి పచ్చడయిపోయిందట...." అడ్డువచ్చింది అమ్మాయి.

"...తోసేయడం ఏమిటి? ఆత్మహత్య అన్నారే!?" అంటూ ఆశ్చర్యపడ్డాను.

"అది పోలీసులన్నమాట. నేను నమ్మను. చిన్నప్పణ్నుంచి దాని సంగతి తెలుసున్నదాన్ని. జీవితం మీద దానికి ఎంత ఆశ వుందో బాగా తెలుసు. ఆత్మహత్య చేసుకుందంటే నేను నమ్ముతానా?"

"నమ్మక...?"

"నమ్మలేదు కాబట్టే తిరుపతి నుండి ఈ బొంబాయి వచ్చాను. పోలీసులెవరూ సహకరించలేదు. ఏం చెయ్యాలా అని ఈ హోటల్లో పనిచేసే వాళ్లని అడగడానికి వచ్చాను. మీ గురించి చెప్పారు - ఫలానా భీమారావు గారని పోలీసు ఫోర్సు నుండి రిటైరయ్యారు, తెలుగాయనే. వనజ అంటే అభిమానం కూడా, ఆయన్ని అడిగితే హెల్ప్ చేస్తారు - అని. అందుకనే..."

"చూడమ్మా, ఆ అమ్మాయంటే అభిమానం ఉండేమాట నిజమే... మా అమ్మాయి ఈడుదని కాబోలు, మా అమ్మాయి పెళ్లయి వెళ్లిపోయిందని కాబోలు. డిపార్ట్‌మెంటులోంచి రిటైరయ్యి కూడా చాన్నాళ్లయి పోయింది. ఏదో కాలక్షేపానికి క్లబ్బుకి వచ్చి మందు కొట్టడం తప్ప నేను చేస్తున్నదేమీ లేదు. పోయిన అమ్మాయి ఎలాగూ పోయింది. నువ్వు ఇవన్నీ తవ్వి తలకెత్తుకోవడం ఎందుకు? ఆ అమ్మాయి శవం కూడా పచ్చడి పచ్చడయిపోయింది. ఆ ముక్కలన్నీ ఏరి పోలీసువాళ్లే దహనం చేసేశారుట. ఇక మీరు చేసేదేముంది? మీ ఊరెళ్లి ఆమె పేర దానాలు, ధర్మాలు ఏదైనా చేసి ఓ దణ్ణం పెట్టి ఊరుకోండి." అంటూ నచ్చచెప్పాను.

వినలేదు. తన పేరు వకుళట. పట్టిన పట్టు వీడదట. తను ఉద్యోగం చేస్తూ దాచుకున్నది ఉన్నదట. నాకు ఫీజు ఇస్తుందట. అక్క హంతకుణ్ని ఉరికంబం ఎక్కిస్తుందట. ఎవరిమీద నీ అనుమానం అనడిగితే అక్కతో బాటు రూములో ఉంటూ ఉండే వీరేశ్ మీదనట.

"అంటే వనజ పెళ్లి చేసుకోకుండా ఇంకోడితో కలిసి ఉండేదన్నది నిజమేనన్నమాట. అల్లరి చిల్లరిగా తిరిగేదన్నమాట కూడా..."

"..అదీ నిజమే! దానికి లేని దురలవాటు లేదు. ముఖ్యంగా డ్రగ్స్. తిరుపతిలో యూనివర్శిటీలో చదివేటప్పుడే అలవాటయ్యింది. ఇక్కడికి వచ్చాక ఇంకా ఎక్కువయింది. తాగుతుంది. తిరుగుతుంది.

వీరేశ్, ఇదీ కలిసి కాపురం పెట్టేశారు. పెళ్లి మీద నమ్మకం లేదనేది. తిట్టేదాన్ని. వినేది కాదు."

"వీరేశ్ మీద నీకు అనుమానం ఎందుకొచ్చింది? చంపితే అతనికి లాభం ఏమిటి?

"లాభం ఏముంది? డబ్బు విషయంలోనో, మరే విషయంలోనో పోట్లాట వచ్చి ఉంటుంది. బాగా అనుభవించి మత్తులో ఉండగా దాన్ని కిటికీలోంచి బయటకు తోసేసే ఉంటాడు. శవం దొరికినప్పుడు ఒంటి మీద బట్టలు లేవని తెలుసుగా మీకు...? ఆత్మహత్య చేసుకొనేవాళ్లు అలా చేయరు. కనీసం ఉత్తరం రాసి పోతారు." అంది వకుళ ఆవేశంగా.

నాకు చిరునవ్వు వచ్చింది. "చూడమ్మా, నా సర్వీసులో ఎన్నో కేసులు చూశాను. ఆత్మహత్య చేసుకునే వాళ్లందరూ సూయిసైడ్ నోట్ పెట్టి చావాలన్న రూల్ ఏమీ లేదు. చక్కగా అలంకరించుకొని చచ్చిపోయినవాళ్లూ ఉన్నారూ, అన్నీ విప్పేసి లోకంలోకి వచ్చినప్పుడు ఎలా ఉన్నామో పోయేటప్పుడూ అలా ఉండాలి అనుకున్నవాళ్లూ ఉన్నారు. దాన్ని బట్టి ఏదీ నిర్ణయించలేం. పోనీ నువ్వు చెప్పినట్టు రతికార్యం తర్వాత ఇది జరిగిందనుకున్నా, డ్రగ్స్ తీసుకుని ఆ మత్తులో జారిపడిందనుకున్నా అది నిర్ధారించడానికి శవం మీద ఆటోప్సీ జరపలేదు. అసలు శవం అనేది దొరుకుతే కదా! అన్నీ మాంసం ముద్దలే!"

నేను ఎంత చెప్పినా ఆ అమ్మాయి వినలేదు. సాధ్యమైనంత ఇన్వెస్టిగేషన్ జరుపుతానని నేను హామీ ఇచ్చేదాకా నన్ను విడిచిపెట్టలేదు.

వనజ ఫ్లాట్ ఉండే కాంప్లెక్స్ "కుబేరా టవర్స్" దగ్గరకు వెళ్లాను. ఇరవై అంతస్తుల భవనం. నాలుగువందల ఫ్లాట్స్. పదిహేనో అంతస్తులో ఉత్తరం వైపు ఉంది వనజ ఫ్లాట్. వాచ్‌మన్‌ని కదలేశా. ఆమె చచ్చిపోయిన రాత్రి అతనే డ్యూటీలో ఉన్నాట్ట. రాత్రి రెండు గంటల ప్రాంతంలో ఎవరో కిందకు పడినట్టు చప్పుడు విని బయటకు వచ్చి చూశాట్ట. అంతలోనే పెట్రోలింగ్ వ్యాన్ వచ్చిందట. వాళ్లు వచ్చి తర్వాత పనులన్నీ చూసుకున్నారట.

వనజ ఎలాటిదన్నాను. ఏదోలెండి అని నోరు చప్పరించేశాడు. "ఎవరైనా కొత్తవాళ్లను తీసుకొచ్చిందా ఆ రోజు?" అని అడిగాను. "కొత్తవాళ్లెందుకు లెండి. కాంప్లెక్స్‌లో వాళ్లు చాలరా?" అన్నాడు వెక్కిరింతగా. అతనితో మాట్లాడిన పావుగంటసేపట్లో నాకు ఒకటి అర్థమయ్యింది – నాలుగువందల ఫ్లాట్స్‌కి వచ్చిపోయే వాళ్లను గమనించడం ఏ ఒక్క వాచ్‌మన్‌కి సాధ్యం కాని పని. ఆ సంఘటన జరిగిన తర్వాత, అదీ అంతరాత్రి కాబట్టి కాంప్లెక్స్‌లోంచి ఎవరైనా బయటకు వెళ్లారేమో గుర్తుపెట్టుకోవడం సహజం. అదే అడిగేను. కొత్తవాళ్లెవరూ వెళ్లలేదుట.

ఆ రోజు గస్తీకి వచ్చిన పోలీసు వ్యాన్‌లో ఉన్నదెవరో వాకబు చేశాను. వాళ్లలో పెండార్కర్ నాకు ముందే తెలుసు. ఆవేళ సాయంత్రం క్లబ్బుకి పిలిచేను. కలిసి తాగుతూండగా కదలేశాను. నీకేమిటి ఇంట్రస్టు? అన్నాడు. వకుళ సంగతి చెప్పాను.

"ఆ తిక్కలమ్మాయ్యేనా? వీరేశ్ చంపేడంటుంది. అతను ఆరుమైళ్ల దూరంలో ఉన్న హోటల్లో వెయిటర్‌గా ఉన్నాడు. ఎలిబయ్ అంత గట్టిగా లేదనుకో. కానీ అక్కణ్నుంచి పరిగెట్టుకొచ్చి, చంపేసి మళ్లీ వెనక్కి పారిపోయాడనుకున్నా... ప్చ్! నమ్మేట్టు లేదు. అసలు ఆ ఫ్లాట్ మెయిన్‌డోర్‌కి తాళంతో బాటు చెయిన్ కూడా వేసి ఉంది. సర్కిల్ వచ్చి దాన్ని కట్ చేయిస్తే గానీ ఆ ఫ్లాట్‌లోకి వెళ్లలేకపోయాం. ఇలాటి స్థితిలో దాన్ని ఆత్మహత్య అనుకోక ఇంకేమిటి అనుకోవాలి చెప్పు?" అన్నాడు పెండార్కర్ విసుగ్గా.

"ఇంకోలా అనుకోవచ్చు కూడా. హంతకుడు ఆ ఫ్లాట్‌లోనే దాక్కున్నాడేమో! ఏ మూలనో నక్కి మీరు వెళ్లిపోయిన తర్వాత జారుకున్నాడేమో!" అన్నాను సాలోచనగా.

"భలేవాడివిలే! ఫ్లాట్‌లోకి వస్తూనే మేం అటూ ఇటూ చూసాం. ఏమీ కనబడలేదు. కిటికీ తలుపు తెరిచివుంది. కిటికీ పక్కన ఓ కుర్చీ. దాని మీద బట్టలు కుప్పగా పోసి ఉన్నాయి. దూకేటప్పుడు బట్టలిప్పుకుని దూకిందని తెలుసుగా. మంచం కింద చూద్దామన్నా దాని లెవల్ బాగా కిందకు ఉంది.

అక్కడ దాక్కోవడం అసంభవం..."

"...బీరువాలో చూసారా? అక్కడ ఉన్నాడేమో!?

నా ప్రశ్న విని పెండార్కర్‌కి విసుగుపుట్టింది. "ఏమిటి గురూ, నువ్వనేది? అంత పై నుంచి ఎవర్నైనా తోసేస్తే నిమిషాల్లో మనుష్యులందరూ గుమిగూడతారని ఎవడికైనా తెలుసు. ఎక్కణ్నుంచి పడిందో చూసుకుని వెంటనే ఫ్లాట్‌లో జొరబడతారనీ తెలుసు. అలాటప్పుడు ఎవడైనా తోసి ఉంటే అక్కణ్నుంచి పారిపోదామనే చూస్తాడు గానీ అక్కడే బీరువాలో కూచుందామని చూడడు. అంతకంటే అందరితో బాటూ తనూ కిందకు పరిగెత్తుకు వచ్చి ప్చ్, ప్చ్ అంటూ నిలబడతాడు."

"ఆ మాటా కరెక్టేలే! అసలు మీరు శవాన్ని ఎలా గుర్తుపట్టారాని ఆశ్చర్యం వేసింది..."

"శవం అనేది ఉంటే కదా, కొన్ని మాంసం ముక్కలనుకో. ఒంటి మీద బట్టలుంటే జేబులు వెతికేవాళ్లం. అవీలేవు. గస్తీ తిరుగుతుంటే పెద్ద చప్పుడుతో పడింది. అసలు ఎక్కణ్నుంచి వచ్చిపడిందా అని తలెత్తి చూసాం. ఓ ఫ్లాట్ కిటికీ తలుపు తెరిచి వుంది. లైటువేసి ఉంది. పదిహేనో అంతస్తు. పరిగెట్టుకెళ్లి బెల్లు కొట్టాం. ఎవరూ తలుపు తీయలేదు. ఈలోపుగా కొంతమంది గుమిగూడారు. దొరికినవాటి బట్టి చూస్తే ఈ అమ్మాయే అయుంటుందన్నారు. క్లబ్ సింగర్, అందమైన అమ్మాయి. చాలామందికి గుర్తే. ఈలోగా సర్కిల్ రావడం, చెయిన్ కట్ చేసి లోపలికి వెళ్లడం, అక్కడ ఆమె బట్టలు కుప్పపోసి కనబడడం, ఓ చెస్ట్‌లో డ్రగ్స్ కంటబడడం – అన్నీ జరిగేక కథ అర్థమయిపోయింది. ఇదిగో ఇప్పుడు ఈ చెల్లెలు వచ్చాక గొడవ మొదలుపెట్టిందంతే. లేకపోతే కేసు మూసేసినట్టే" ఓపిగ్గా చెప్పుకొచ్చాడు పెండార్కర్.

మర్నాడు వకుళ ఇచ్చిన తాళం చెవితో వనజ ఫ్లాట్‌కి వెళ్లాను. అంతా గందరగోళంగా, ఆమె జీవితం లాగానే చిందరవందరగా ఉంది. కుర్చీ మీద కుప్పగా పడి వున్న బట్టలు చూస్తూండగా నాకో విషయం తట్టింది. ఎవరైనా అమ్మాయి బట్టలు విప్పినప్పుడు చీర, జాకెట్టు విప్పిపడేసి తర్వాత లంగా, బ్రా విప్పుతారు. అందువల్ల బట్టలు కుప్పపోసినప్పుడు లోదుస్తులు పైన ఉండడం సహజం. కానీ ఇక్కడ మాత్రం అలా లేదు. చీర, జాకెట్టు పైన ఉన్నాయి. ఇదెలా సాధ్యం?

ఆ బట్టలు వేరెక్కడనుండైనా పట్టుకొచ్చి పడేశారా? పడేసినప్పుడు కిందా మీదా అయ్యాయా? వేరెక్కడనుండైనా పట్టుకొచ్చే సందర్భం ఎలా వస్తుంది? అంటే వనజతో వేరే ఎక్కడైనా రతికార్యం సలిపివుండవచ్చు. ఆ తర్వాత ఒళ్లు తెలియని స్థితిలో ఉన్న ఆమెను ఇక్కడకు తీసుకొచ్చి కిటికీలోంచి విసిరేసి ఉండవచ్చు. లేదా ఇదంతా ఊహాగానమేమో! పోలీసులు వచ్చినప్పుడు కుర్చీని తన్నేసి, కిందపడిపోయిన బట్టల్ని మళ్లీ పెట్టడంలో కిందాపైనా అయివుండవచ్చు. ఏది నిజమో ఎలా తెలుస్తుంది?

పెండార్కర్ వాదన ప్రకారం హత్య చేసి హంతకుడు బయటకు పారిపోయే వీలులేదు, మెయిన్‌డోర్‌కి లోపల నుండి చెయిన్ వేసి ఉంది కాబట్టి. ఆ వాదనలో ఎంత బలముందాని జాగ్రత్తగా పరీక్షించి చూసాను. చూడగా, చూడగా, బయటనుండి కొత్త చెయిన్ తెచ్చి వేసి ఒక అరగంట సేపు కుస్తీ పట్టగా పట్టగా నాకు అర్థమయిందేమిటంటే ఆ చెయిన్‌ను బయట నుంచి కూడా సులభంగా వేసేయచ్చు. బిల్డర్ అంత గొప్పగా కట్టాడు. అంటే హంతకుడు ఫ్లాట్ లోపల దాక్కోవలసిన అవసరం లేదు. వనజను తోసేసి దర్జాగా బయటకు వచ్చేసి తలుపు చెయిన్ బయట నుండి వేసేసి, డోర్ తాళం పడేటట్టు దగ్గరకు లాగేసి తన దారిన తను వెళ్లిపోవచ్చు.

అటువంటి అవకాశం వీరేశ్‌కు ఉంది. అతను ఆ ఫ్లాట్‌లో వనజతో బాటు కలిసి ఉంటున్నాడు కాబట్టి అతని రాకపోకలు ఎవరికి అనుమానాలు కలిగించవు. మధ్యాహ్నం మూడు గంటలయ్యేసరికి వీరేశ్ దొరికాడు, అతి కష్టం మీద. అతనెక్కడ ఉంటాడో ఎవడూ సరిగ్గా చెప్పలేకపోయాడు. చివరికి ఘాట్‌కోపర్‌లో ఓ పాత ఇంటి పోర్షన్‌లో పట్టుకున్నాను. తలుపు ఒక పట్టాన తెరవలేదు. కారణం తర్వాత తెలిసింది. అతనితో బాటు ఉన్న అమ్మాయిని బాత్‌రూమ్‌కి తరమడంలో ఆలస్యం అయింది.

వీరేశ్ లాటి నిర్దయుడిని నేనింతవరకు చూడలేదు. వనజ మీద అస్సలు సింపతీ లేదు. 'ఆ

అమ్మాయే నా వెంటపడింది, ఆడది మోజుపడితే ఓ లెవల్ వరకు ఫర్వాలేదు కానీ మరీ మోతాదు మించిపోయింది. అందుకనే నేను ఆ ఫ్లాట్‌లో ఉండడం తగ్గించేను. అలాటి డ్రగ్ ఎడిక్ట్‌తో కలిసివుండడం చాలా కష్టం. చచ్చి కూడా నన్ను సాధిస్తోంది. పోలీసుల బాధ పడలేక అడ్రసు మార్చుకున్నాను. అయినా వెంట పడి వేధిస్తున్నారు.' అంటూ వాపోయేడు.

"నువ్వు ఆఖరుసారి ఎప్పుడు చూశావ్?" అడిగేను.

"చచ్చిపోయిన రాత్రి ఎనిమిది గంటలకు మా హోటల్‌కి వచ్చి కూచుంది. మళ్లీ ఫ్లాట్‌కి వచ్చి తనతో ఉండమని గోల. ఎంత చెప్పినా వినలేదు. మెట్లమీద కూచుంది. పది గంటల దాకా ఒకటే ఏడుపు. నచ్చచెప్పి పంపేసరికి తాతలు దిగొచ్చారు."

"వనజను వదుల్చుకుంటే కొత్త పిట్టలను పట్టుకోవచ్చు కదాని ఆ రాత్రే కడతేర్చేశావన్నమాట!" అన్నాను కరుగ్గా బాత్‌రూమ్‌కేసి చూస్తూ.

"కొత్త పిట్టలను పట్టుకోవడానికి వనజను చంపనక్కరలేదు. మేమిద్దరం భార్యభర్తలం కాదు. నాకు బయట వ్యవహారాలున్నట్టే, తనకూ ఉన్నాయి. ఒక్కోప్పుడు రోడ్డు మీద పోతూ, పోతూ, కంటికి నచ్చినవాడు కనబడితే ఫ్లాట్‌కి పిల్చుకుపోతుంది. ఎవడూ దొరక్కపోతే కాంప్లెక్స్‌లోనే ఉన్న మెస్రాతో సరిపెట్టుకుంటుంది. సెక్సుకు మరీ ప్రాధాన్యత ఇచ్చి అసూయాద్వేషాలతో ఒకరినొకర్ని చంపుకోవడం మా పద్ధతి కాదు" అన్నాడు వీరేశ్ ఏమాత్రం సిగ్గుపడకుండా.

కానీ వీళ్ల వ్యవహారాలు వినడానికి నాకు సిగ్గువేసింది. మాట మారుస్తూ, "చచ్చిపోయిన వాళ్ల స్టీరియోలు ఎత్తుకురావడం మీ పద్ధతా?" అని అడిగేను.

వీరేశ్ ఉలిక్కిపడ్డాడు. "ఈ స్టీరియో వనజదేనని మీకెలా తెలుసు?"

"అక్కడ డ్రెసింగ్ టేబుల్ మీద ఉన్న దుమ్ము బట్టి. దాని మీద నుండి ఏదో వస్తువు తీసేసినట్టు అక్కడున్న ఖాళీబట్టి తెలిసింది. నీ దగ్గర చూడగానే నాకు తెలిసిపోయింది."

"స్టీరియో తనది మాత్రమేనని ఎలా చెప్పగలరు? మేం ఇద్దరం కలిసి కొని ఉండవచ్చుగా." అంటూ వాదించబోయేడు.

"అతని వాదనల మాట ఎలా ఉన్నా ఆ స్టీరియో ఎత్తుకురావడం బట్టి అతని బుద్ధి నాకు తెలిసింది. అతను నీచుడు కానీ హంతకుడు కాడు" అన్నాను ఆ రాత్రి ఎనిమిది గంటలకు వకుళతో. ఇద్దరం కలిసి క్లబ్‌లో కాఫీ తాగుతున్నాం.

"అలా ఎలా చెప్పగలరు... అంకుల్?" అడిగింది వకుళ.

"హంతకుడెవ్వడూ హత్యాస్థలం నుండి ఇటువంటివి ఎత్తుకురాడు - ముఖ్యంగా తన మీద నిఘా ఉంటుందని తెలిసినప్పుడు... ఒకవేళ వనజ పీడ వదుల్చుకుందామని చంపడానికి నిశ్చయించుకున్నా ఆమె తన హోటల్‌కి వచ్చి అల్లరిపెట్టిన రోజున కాకుండా వేరే రోజు ప్లాన్ చేసేవాడు."

"మరి ఇంకెవరికి ఛాన్సుంది? ఆ రోజు వనజ ఏం చేసిందో అన్నీ కనుక్కున్నాను. వీరేశ్ నుండి వచ్చేసాక క్లబ్‌కి వెళ్లి ఈ రోజు పాడలేనని చెప్పి, కాస్త బియర్ తాగేసి ఇంటికి వెళ్లిపోయింది."

"ఇంకేం మరి? ఆ రోజు మూడ్ బాగాలేదని అర్థమవుతోందిగా, జీవితం మీద విసుగుపుట్టి డ్రగ్స్ తీసుకున్న మత్తులో కిటికీలోంచి దూకి ఆత్మహత్య చేసుకుందేమో!" అంటూ వకుళను కన్విన్స్ చేయబోయాను కానీ ఆమె వినలేదు.

ఇంకో అరగంటలో బయటకు వచ్చాం. ఆటో పిలిచాను, తనను దింపేసి మా ఇంటికి వెళదామని. దారిలో ట్రాఫిక్ జామ్ ఆగిపోయినప్పుడు నేను గొంతు సవరించుకున్నాను. "వకుళా, నేను ఈ కేసులో చేయగలిగేదేమీ లేదమ్మా! హత్య అనడానికి ఆధారాలు ఏమీ కనబడడం లేదు. నువ్వు తిరుపతి వెళ్లిపో. ఇక్కడ ఉండి చేయగలిగేదేమీ లేదు" అని అంటూండగానే నా దృష్టి దగ్గరలో ఉన్న కాంప్లెక్స్ మీద పడింది. కుబేరా కాంప్లెక్స్ లాగానే అదీ అనేక అంతస్తుల బిల్డింగు. పై అంతస్తుల్లో రెండు



ఫ్లాట్స్‌లో తప్ప వేరే ఎక్కడా లైట్లు లేవు. ఆ ఫ్లాట్స్ కూడా రెండు వేర్వేరు అంతస్తుల్లో ఉన్నాయి కానీ వరసగా ఉన్నాయి.

అది చూడగానే నాలో ఓ ఆలోచన వెలిగింది. వనజ తన ఫ్లాట్‌లో నుంచే తోయబడిందన్న గ్యారంటీ ఏమిటి? అదే వరసలో ఉన్న మరో ఫ్లాట్‌లోంచి కూడా తోయబడవచ్చుగా!? శవం ముక్కలు ముక్కలవడం చూసి ఏ పదిహేనో అంతస్తో అనుకుని ఉంటారు కానీ అది పధ్నాలుగో అంతస్తయినా కావచ్చు. ఇరవయ్యో అంతస్తయినా కావచ్చు. శవాన్ని చూడగానే తలెత్తి చూసి ఉంటారు పోలీసులు. కిటికీ తెరిచివున్న లైట్లు వేసివున్న పై అంతస్తు ఫ్లాట్ మీదకే వాళ్ల దృష్టిపోయింది. పైగా లోపల నుండి చెయిన్ వేసి ఉండడం ఒకటి.

కానీ చెయిన్ బయట నుండి కూడా వేసి ఉండవచ్చని తేల్చుకున్నాను కదా. కుర్చీ మీద పడివున్న బట్టల్లో ఉన్న తికమకకు కూడా సమాధానం దొరికినట్లవుతుంది. హంతకుడు ఆ కాంప్లెక్స్‌లోనే నివసించేవాడయితే. చావుకు ముందు హంతకుడితో వనజ రతిలో పాల్గొందని అనుకుంటే ఆ ప్రియుడు కూడా ఆ ఫ్లాట్స్‌లో ఉన్నాడని అనుకోవచ్చు. వాచ్‌మన్ మాటలు గుర్తుకువచ్చాయి. 'కొత్తవాళ్లను తీసుకురావడం దేనికి? కాంప్లెక్స్‌లో వాళ్లు చాలరా?' అన్నాడతను వనజ గురించి. ఈ పాయింట్ ఎలా మిస్ చేశానో నాకే తెలియదు. వకుళను తన దారిన తాను వెళ్లమని చెప్పేసి, నేను ఇంకో ఆటో తీసుకుని కుబేరా కాంప్లెక్స్‌కు చేరాను. పదో అంతస్తు కంటే పైనున్న ఉత్తరపు వైపు ఫ్లాట్స్‌లో ఉన్నవాళ్ల పేర్లన్నీ నోట్ చేసుకుంటూ ఉంటే మెహ్రా పేరు తగిలింది. ఎక్కడో విన్నట్టు అనిపించింది. అంతలో ఛట్టున గుర్తుకు వచ్చింది. వీరేశ్ అన్నది అతనామె ప్రియుడని. ముసలితనం వల్లనేమో నాకు మతిమరుపు పెరిగిపోతోంది. లేకపోతే ఆ లీడ్ మీద ముందే వర్క్ చేసి ఉండాల్సింది. మెహ్రా ఫ్లాట్ పదిహేడో అంతస్తులో. సరిగ్గా వనజ ఫ్లాట్‌కి పైన. పరుగుపరుగున వెళ్లాను.

మెహ్రాను చూడగానే మాత్రం నిరుత్సాహపడ్డాను. ఏభైపడిలో ఉన్నవాడు. ఒక క్లబ్ సింగర్‌కి ప్రియుడు కాగల లక్షణాలు ఏ మాత్రం లేవు. వీరేశ్ అసూయకొద్దీ అన్నాడేమో, వాచ్‌మన్ వేరేవాళ్లను ఉద్దేశించి అన్నాడేమో. మెహ్రా భార్యకు పూనా ట్రాన్స్‌ఫర్ అయిందట. వారాంతాల్లో వస్తూంటుంది. మనిషి పెద్దమనిషిలా, సమాజానికి భయపడే మనిషిలా ఉన్నాడు. వనజ గురించి అడిగితే 'పాపం, మంచిపిల్ల. చెడుసావాసాల వల్ల పాడయింది' అన్నాడు. లోతైన మనిషి. చాలా జాగ్రత్తగా కూపీ లాగాలి.

"నాకు కావలసిన మనిషి కాబట్టి వివరాలు తెలుసుకున్నాను. చెబుతాను వినండి" అంటూ మొదలుపెట్టి నెమ్మది, నెమ్మదిగా ఒక్కొక్కటీ చెప్పుకురావడం మొదలుపెట్టాను. కిటికీ గురించి, కుర్చీ మీద ఉన్న దుస్తుల గురించి, చెయిన్ బయట నుండి వేయడం గురించి... క్రమక్రమంగా మెహ్రా మొహంలో వస్తున్న మార్పులు నా దృష్టిని దాటిపోలేదు. చివరికి అతని కిటికీ వద్దకు వెళ్లి డ్రమటిక్‌గా "ఇదిగో, ఈ

కిటికీలోంచే మీరు ఆమెను తోసేశారు. ఆమె వెంట్రుక ఇక్కడ ఇరుక్కుంది చూడండి." అని అరిచాను.

"ఎక్కడ? ఎక్కడ?" అంటూ పరిగెట్టుకు వచ్చాడు మెహ్రా. మూసివున్న నా గుప్పిలి మీద పడింది అతని చూపు. బలవంతంగా విప్పబోయాడు. పెనుగులాడుతూనే, "మీరు అబద్ధాలు ఆడుతున్నారు. కిటికీ అంతా శుభ్రంగా తుడిచేను. మీ దగ్గర ఏ ఆధారమూ లేదు" అంటూ హిస్టీరిక్‌గా అరిచేడు.

"మీరు ఆమెను ఎందుకు చంపవలసి వచ్చిందో చెబితే గుప్పిట్లో ఉన్నది మీకు ఇచ్చేస్తాను" అన్నాను అతన్ని విదిలించుకుంటూ.

"నేను కావాలని చంపలేదు. అది యాక్సిడెంట్..." అంటూ ఏడవనారంభించేడు మెహ్రా.

నేను అతన్ని కూచోబెట్టి నిదానంగా సంగతులు రాబట్టేను. మెహ్రా పనిచేసే మందుల ఫ్యాక్టరీలో తయారయ్యే కెమికల్స్ కొన్ని మత్తు కలిగిస్తాయి. వాటికోసం వనజ అతనితో స్నేహం చేసింది, అందం చూసి కాదు. భార్య వేరే ఊళ్లో ఉండడంతో మెహ్రా మనస్సు కూడా చలించింది. అప్పుడప్పుడు పక్క పంచుకునేవారు. ఆ రోజు కూడా కెమికల్స్ కోసమే వచ్చింది వనజ. అవి ఇచ్చాక మెహ్రా, ఆమె కలిసి రతిలో పాల్గొన్నారు. ఒక గంట సేపు నిద్రపోయాక హఠాత్తుగా లేచింది వనజ. వీరేశ్‌ను తలుచుకుని హిస్టీరికల్‌గా ఏడవనారంభించింది. గట్టిగా ఏడిస్తే కాంప్లెక్స్‌లో అందరికీ తెలుస్తుందేమోనని భయం పట్టుకుంది మెహ్రాకు. ఆమెను శాంతింపచేయడానికి కాస్సేపు సముదాయించబోయి, అది పనిచేయకపోతే సినిమాల్లో చూపించినట్టు చాచిపెట్టి రెండు లెంపకాయలు కొట్టాడు. దెబ్బకి వనజ నేల మీద పడింది. పడడంలో కుర్చీకోడు తగిలిందేమో మెడ విరిగింది. నాడి చూడబోతే అందలేదు.

"దాంతో మీకు భయం వేసింది. ఫ్లాట్‌లో శవం. శవం కోసి చూస్తే మీరు ఫ్యాక్టరీ నుండి ఎత్తుకొచ్చిన డ్రగ్స్. మర్నాడు మీ భార్య ఊరినుండి వస్తుంది. దాంతో కిటికీలోంచి బయటకు విసిరేసి చేతులు దులిపేసుకున్నారు. ఎంత ఘోరం!"

"సార్, మీరు సరిగ్గా అర్థం చేసుకోవాలి. వనజను వాళ్ల ఫ్లాట్‌కి చేరుద్దామనే అనుకున్నాను ముందు. బట్టలు తొడగడం పెద్ద పని. తొడిగినా ఆమెను రెండు ఫ్లోర్స్ కిందకు తీసుకెళ్లాలంటే ఎవరో ఒకరి కంట బడడం ఖాయం. అందుకని వెళ్లి వీరేశ్ సాయం అడుగుదామనుకున్నాను. ఫ్లాట్‌కి వెళ్లి బజర్ మోగించాను. ఎవరూ పలకలేదు. ఆమె బ్యాగ్‌లో ఉన్న తాళం చెవితో ఫ్లాట్ తెరిచి, బయటనుండి చెయిన్ తీసేసి, – ఒకసారి చూపించింది లెండి, బయటనుండే ఎలా వేయచ్చో, తీయచ్చో – లోపలికి వెళ్లాను.

"అప్పుడు వచ్చింది కిటికీ ఐడియా. నా ఫ్లాట్‌కి వెళ్లి బట్టలు తెచ్చి కుర్చీ మీద పడేసి, కిటికీ తలుపు కొద్దిగా తెరిచి పెట్టి, లైట్లు వేసి వచ్చాను. వచ్చేటప్పుడు చెయిన్ బయటనుండి వేసేశాను. నా ఫ్లాట్‌కి తిరిగివచ్చాక ఎందుకైనా మంచిదని మళ్లీ ఒకసారి పల్స్ చూశాను. కొట్టుకోవటం లేదు. ఇక నేను చేయగలిగేదేమీ లేదు. ఈ చావు గొడవ నుండి దూరంగా ఉండడానికి ప్రయత్నించాను. నా ఫ్లాట్‌లో లైట్లు ఆర్పేసి, కిటికీలోంచి ఆమె శవాన్ని బయటకు విసిరేశాను. కిటికీ మూసేశాను. నేను హత్య చేయలేదు. అది ఏక్సిడెంట్ మాత్రమే. నన్ను నేను కాపాడుకోవడానికి చేసిన ప్రయత్నం కూడా భగవంతుడికి సమ్మతం కాలేదు. ఎంత జాగ్రత్త పడినా ఓ ఆధారాన్ని మీకందించేడు" అంటూ విలపించేడు మెహ్రా.

నేను గుప్పిలి మెల్లగా విప్పేను. ఏమీ లేదు. మెహ్రా కనుగుడ్లు పెద్దవవుతూండగా అతని భుజం తట్టాను. "పోలీసుస్టేషన్‌కి వెళ్లి నిజం చెప్పేయండి. శిక్ష మాట ఎలా ఉన్నా మనశ్శాంతి దొరుకుతుంది." అని సలహా ఇచ్చాను.

తిరుపతి తిరిగి వెళ్లబోయేముందు వకుళ నా వద్దకు వచ్చి కలిసి వద్దంటున్నా వెయ్యినూటపదహార్లు చేతిలో పెట్టింది, ఫీజుగా.